సుచీ! మీరూ కూర్చోండి'' అంది యిద్దరి వైపు చూస్తూ, చిర్నవ్వుతో.

సీత అత్తయ్య ముఖంలో విచార రేఖలు కన్పిస్తున్నాయి. జుట్టు చాలాభాగం తెల్లబడిపోయింది. అయినా నవ్వులో మార్పేమీ లేదు. అదే అందమైన చిర్నవ్వు అనుకొంది సుచిత్ర, చాపమీద కూర్చుంటూ.

''అమ్మా, నాన్నా, అంతా బాగున్నారా సుచీ!'' అంది సీత అత్తయ్య ప్రక్కగది గుమ్మాన్ని ఆనుకుని.

''ఆఁ అంతా బాగున్నారు అత్తయ్యా! మళ్ళీ యిన్నాళ్ళ తర్వాత నిన్ను చూస్తే, ప్రాణం లేచివచ్చినట్లయ్యింది'' అంది సుచిత్ర కళ్ళంబడి తిరిగే నీళ్ళని ఆపుకో ప్రయత్నిస్తూ.

''అవును, నాకూ ఎంతో ఆనందంగా వుంది యివ్వేళ ఎన్నాళ్ళయ్యింది నిన్ను చూసి! పది ఏళ్ళయ్యింది కదూ!''

''నాకు ఎన్నో యుగాల క్రితం చూసి నట్లుంది'' అంది సుచిత్ర, గది నాలుగు మూలలా కలియచూస్తూ. గది గోడ మధ్యన ఓ అందమైన యువకుడి ఫొటో వుంది. అతనే కాబోలు రంగనాధం!

సీత అత్తయ్య వోసారి సుచిత్రని కళ్ళారా చూసి, ''అయితే రేపో, ఎల్లుండో పెళ్లికూతురువి అవబోతున్నావన్నమాట! చాలా మంచి సంబంధం ఎంచుకున్నావు సుచీ! అబ్బాయి ఎంతో బుద్ధిమంతుడు'' అన్నది. సుచిత్ర, రంగనాధం ఫొటో వంకే తదేకంగా చూస్తూండటం గమనించి, సీత అత్తయ్య ''అయనే మీ మామయ్య! ఏడేళ్ళయ్యింది, యీ లోకం వదిలేసి.'' ''ఇప్పుడే వస్తా వుండండి'' గద్గదస్వరంతో అని, ప్రక్కగదిలోకి వెళ్ళిపోయింది

''పాపం....ఎన్ని అవస్థలు పడిందో యిన్నాళ్ళూ! ఎట్లా రోజులు వెళ్ళబుచ్చిందో యీ ఏడేళ్ళు'' అంది సుచిత్ర బాధతో.

''ప్రయివేట్లు చెప్పుకుని పొట్ట పోసుకుంటూందిట'' అన్నాడు వెంకట్రావు. మరో నాల్గు నిమిషాలకి రెండు ఆకులలో యింత ఉప్మా, తీసుకొచ్చిపెట్టి, ''పేద వాళ్ళ యింట్లో యింతకంటె మంచి టిఫిన్ ఏం దొరుకుతుంది?'' అంది సీత అత్తయ్య.

''అయ్యో! ఎందుకండి....యీ శ్రమ అంతా!'' అన్నాడు వెంకట్రావు.

''శ్రమేం కాదు, తీసుకోండి'' అంది సీత అత్తయ్య

''పాపం .... మా కోసం యీ టిఫిన్ ఎంత అవస్థపడి చేసిందో! ఈ టిఫిన్ తయారు చెయ్యడానికి యెంత త్యాగం చెయ్యాల్సి వచ్చిందో!' అనుకుంది. సుచిత్ర లోపలలోపలే. టిఫిన్ తింటూనే, సీత అత్తయ్యవైపు సూటిగా చూస్తూ, ''ఎల్లుండి పెళ్ళికి నువ్వు రావాలి అత్తయ్యా! నీ పేరుకూడా నేను లిస్టులో వేసుకున్నా....పిలవాలని! ఏం! వెంక

ట్రావు?''

"అవును. ఆమాట నిజమేనండి" అన్నాడు వెంకట్రావు.

"నిజమే అవొచ్చునర్రా! శుభమా అంటూ మీరు పెళ్ళి చేసుకుంటూంటే, మధ్య నేనెందుకు అక్కడికి, పానకంలో పుడకలాగ."

"లేదత్తయ్యా! నువ్వు అక్కడికి వచ్చితీరాలి" అంది సుచిత్ర గునుస్తూ.

"ఒసేవు ... ఖచీ! నువ్వొట్టి వెర్రి బాగులదానివే, నీకు నామీద వల్లమాలిన అపేక్ష వుంటే వుండొచ్చు కాని, అది చూపించే పద్ధతి యిది కాదే తల్లీ! నే నక్కడికి అకస్మాత్తుగా వచ్చేసరికి చాలా మందికి తల తిరుగుతుంది. బోలెడు మందికి కోపాలు వస్తాయి. కొంతమంది అలిగి వెళ్ళిపోతారు కూడాను. మధ్య నువ్వూ, మీ నాన్నా ఇరుకున పడతారు"

"ఏమైనా అవనీ అత్తయ్యా! నువ్వు వచ్చి తీరాలి. ఎవరికి కోపం రానీ, తల తిరగనీ, నేనేం లెక్కచెయ్యను. ఇది నా పెళ్ళి! నువ్వు కావాలని, నేనూ, వెంకట్రావు అడుగుతున్నాం."

"అవునండీ! మీరు వచ్చి తీరాలి" అన్నాడు వెంకట్రావు నిశ్చయంగా.

సీత అత్తయ్య, వెంకట్రావు, సుచిత్రలను వకరితర్వాత మరొకరిని ఆనంద బాష్ప నేత్రాలతో చూసి, "మీరెంతో మంచి పిల్లర్రా! అంచేత యీ ఏకాకి అత్తయ్యని యింత ప్రేమగా ఆహ్వానిస్తున్నారు. మీ ప్రేమ, ఆదరాలతో యివ్వేళ నా జన్మ తరించింది అనిపిస్తోంది. కాని వక్క సంగతి.... మీ నాన్న...." అన్నది సుచిత్రమీద దృష్టి నిలిపి.

"నాన్న కూడా ఏమీ అనరు అత్తయ్యా...."

"నువ్వుండు సుచిత్రా! ఇదిగోనండి! మీ అన్నయ్యగారు స్వయంగా మీకు యిమ్మని పంపిన శుభలేఖ అంటూ వెంకట్రావు శుభలేఖ వున్న కవరు వకటి సీత అత్తయ్య చేతిలో పెట్టాడు.

వణికే చేతులతో కవరుని అందుకొని సీత అత్తయ్య, అందులోని శుభలేఖని బయటికితీసి చూసింది. శుభలేఖపైన వకమూలగా, "సీతా! నువ్వు అమ్మాయి పెళ్ళికి వచ్చితీరాలని మా వుభయుల కోరిక! రెండురోజులు ముందుగానే రావాలి. ఇప్పుడే బయలుదేరు' కింద గోపాలం, కాంతమ్మగారి సంతకాలు వున్నాయి.

సీత అత్తయ్య పెదవులు కంపించేయి, తల వంచుకుంది. వెచ్చటి కన్నీటిబొట్లు బొటబొటా రాలేయి

సుచిత్ర ఆశ్చర్యంగా వెంకట్రావు వైపు చూసి, "నాన్నతో, అత్తయ్యని చూసివచ్చినట్లు చెప్పేసేవా?"

"అవును. ఆ సంగతే మేము ఆయన గదిలో మాట్లాడుకొంటున్నాం. మీ అత్తయ్య ఎక్కడుందో తెలిస్తే, ఆయన మనస్సు మారుతుందని, మీ

అత్తయ్య వునికి గాలించి పట్టుకున్నా అఖరికి."

"వెంకట్రావు, నాకు పెళ్ళి కానుకగా నువ్వు మా అత్తయ్యని యిచ్చేవు జన్మ లో మీ మేలెన్నటికి మరచిపోలేను." అంది సుచిత్ర.

"అరెరే! లోపల కాఫీ పొంగి పోతుంది. వస్తాను వుండండి!" అంటూ అత్తయ్య లోపలికి వెళ్ళి రెండు కప్పు లతో కాఫీతెచ్చి అన్నది.

"నేను ఎన్నో కష్టాలు అనుభవించి నేర్చుకున్న జీవితపాఠం మీకు చెప్పాలని వుందర్రా! నేను చేసిన పొరబాటుకి, అనుభవించిన కష్టాలు, ఎవరూ అనుభ వించకూడదనే నా ఆశ. సంఘంలో వుంటున్న జీవులకి, అనుసరించాల్సిన నియమాలు, నిబంధనలు కొన్నివున్నాయి అవి వకొక్కప్పుడు చాలా బాధాకర గా అనవసరమైనవిగా కన్పించవచ్చును కూడాను అంతమాత్రాన వాటిని అన హ్యించుకుని, కాలదన్నేమా అతిక్రమిం చేమా చాలా బాధలు అనుభవిస్తాము. అ నియమాలు నిబంధనలు ఎన్నో శతాబ్దాల నాటివి, ఎంతో ఆలోచించి అనుభం మీద మన పూర్వీకులు ఏర్పరిచినవి. వాటిని ఎంతమాత్రం నిరసించకూడదని నా అనుభవంమీద గ్రహించిన సత్యం. మీరుకూడా వాటిని నిరసించకూడదనే నా కోరిక. సంఘంలోని మూఢాచారాలు ఆవ్వీ అంటావా, వాటిని మార్చవలసిందే నేను కాదను. ఇదే నేను మీకు చెప్ప దల్చుకున్నది."

"నువ్వు చెప్పిన సలహా యీరోజుల్లో కొంచెం కటువుగా కన్పించినా, చాలా మంచి సలహా అత్తయ్యా." అంది కాఫీ పూర్తిచేసేన సుచిత్ర. "అవు నండి చాలా మంచి సలహా యిచ్చేరు. కాని మాకోరిక!" అన్నాడు వెంకట్రావు. కాఫీ త్రాగేసి.

"అవును. ఇప్పుడే! మా తో నే రావాలి. రా అత్తయ్యా!" అంది సుచిత్ర ప్రార్థనా పూర్వకంగా అత్తయ్య చేతిని పట్టుకుని

అవిడ వక్క-క్షణం తటపటాయించి, అఖరికి అంది:

"ఇంతమంది యిట్లా అడుగుతూంటే రాకమానతానా! వస్తానర్రా .... వస్తా! ఒక్క క్షణం ఆగండి నా పాతసంచీలో రెండు చీరలు పడేసి తీసుకొస్తా."

మరో పది నిమిషాలకి వీ, అత్తయ్యని తీసుకుని, సుచిత్రా, వెంకట్రావులు కారు ఎక్కేరు

కారు కదలుతూండగా, "అత్తయ్యా! నా గది నీకిచ్చేస్తాను. నువ్వు మళ్ళి ఎక్కడికీ వెళ్ళడానికి వీల్లేదు తెల్పిందా!" అంది సుచిత్ర అత్తయ్య చేతుల్ని తన చేతిలోకి తీసుకొని

నీత అత్తయ్య. నిశ్శబ్దంగా, సుచిత్రని తన దగ్గరికి లాక్కొని, ముద్దు పెట్టు కుంది ప్రేమతో: కళ్ళల్లోంచి బాష్పాలు ధారగా కా తూండగా. సుచిత్ర కృత జ్ఞతతో, వెంకట్రావు వైపు ఓరగా మౌనంగా, అనందంతో పుక్కిరిబిక్కిరి అవుతూ చూపింది.